హ్యాట్సాఫ్.. అంజి

ఆటోపై మొక్కలు పెంచినందుకు ఎంపీ సంతోష్‌కుమార్ అభినందన

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): పర్యావరణంపై స్ఫూర్తి ఉంటే ఆవిష్కరణలు చేపట్టవచ్చని మహబూబాబాద్‌కు చెందిన ఆటో డ్రైవర్ అంజి నిరూపించారు. ఆటోపై మొక్కలు పెంచి, గ్రీన్ ఇండియా చాలెంజ్ వ్యవస్థాపకుడు, ఎంపీ సంతోష్‌కుమార్ దృష్టిని ఆకర్షించారు. ఎండ వేడిని తట్టుకునేందుకు వీలుగా ఆటోపై మొక్కలు పెంచుతూ ప్రయాణికులకు చల్లని ప్రయాణం అందిస్తున్నందుకు అంజికి ఎంపీ హ్యాట్సాఫ్ చెప్పారు. అంజికి ఉన్న పర్యావరణ స్ఫూర్తిని ఎక్స్ (ట్విట్టర్) వేదికగా కొనియాడారు.

పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయండి

- **ఎమ్మెల్సీ కవిత డిమాండులో తప్పేముంది?**
- **పద్మశాలి సంఘం జాతీయ రాజకీయ విభాగం అధ్యక్షుడు శివశంకర్**

హైదరాబాద్, జనవరి31 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహ ఏర్పాటు విషయాన్ని రాజకీయం చేయొద్దని పద్మశాలి సంఘం జాతీయ రాజకీయ విభాగం అధ్యక్షుడు బొల్ల శివశంకర్ ఒక ప్రకటనలో ప్రభుత్వానికి హితవు పలికారు. విగ్రహ ఏర్పాటు విషయాన్ని ఎవరు ప్రతిపాదిస్తే ఏమిటని, ప్రభుత్వం చొరవ తీసుకొని విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విగ్రహ ఏర్పాటును ప్రతిపాదించిన ఎమ్మెల్సీ కవితపై మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు సరికాదని పేర్కొన్నారు. అసలు పూలే విగ్రహ ఏర్పాటుపై ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ కవిత ప్రతిపాదన ఏమైనా ఆటంకమా? అదేమైనా అడగరాని విషయమా? అని ప్రశ్నించారు. ఉమ్మడి ఏపీగా ఉన్నప్పుడు అసెంబ్లీ ఆవరణలో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు ఆనాడు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలిగా కవిత విజ్ఞప్తి మేరకు విగ్రహాన్ని ఏర్పాటు చేసి, కవిత చొరవను అభినందించారని తెలిపారు. నేడు ఎమ్మెల్సీ అయిన కవిత అసెంబ్లీ ప్రాంగణంలో అణగారిన వర్గాల స్ఫూర్తి ప్రదాత పూలే విగ్రహాన్ని నెలకొల్పాలని కోరడంలో తప్పేమిటని పేర్కొన్నారు.

16న రాష్ట్రవ్యాప్తంగా ఆటోల బంద్

మొదటిపేజీ తరువాయి...

బీఆర్‌టీయూ, సీఐటీయూ, ఎఫ్‌యూటీయూ, ఐఎఫ్‌టీయూ తదితర సంఘాలన్నీ మద్దతు ఇచ్చినట్టు టీఏటీయూ ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య తెలిపారు. ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని, రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్‌కు నెలకు రూ. 15 వేలు చెల్లించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బీ వెంకటేశం, ఎస్ నర్సింహారెడ్డి, పీ శ్రీకాంత్, వీ కిరణ్, ఏ సత్తిరెడ్డి, సలీం, మీర్జారఫత్‌బేగ్, సతీశ్, ప్రేమ్ చందర్‌రెడ్డి, తిరుమలేశ్‌గౌడ్, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాడార్‌తో హైదరాబాద్‌కు ముప్పు

గాలి, నీరు కలుషితమయ్యే ప్రమాదం

- **వికారాబాద్ అడవి 5 నదుల జన్మస్థానం**
- **రాడార్ కేంద్రంతో ఆ నదులన్నీ ఎండిపోతాయి**
- **మూసీని బాగుచేస్తామని లండన్ పోతున్నరు.. అది పుట్టిన అడవులను కొట్టేస్తమంటున్నరు**
- **ప్రతిపాదిత ప్రదేశం ప్రకృతితోపాటు పవిత్రతకూ మూలం**
- **చెట్లు లేవన్న నేవీ ప్రకటనపై అటవీశాఖ మౌనమెందుకు?**
- **ఏ మొక్కలను కొట్టేస్తున్నారో ఎందుకు చెప్పడంలేదు?**
- **పర్యావరణవేత్త బీవీ సుబ్బారావు సూటి ప్రశ్నలు**

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీఎల్ఎఫ్ రాడార్ కేంద్రాన్ని వికారాబాద్‌లో పెట్టడం దారుణమని, ప్రభుత్వం తన ప్రతిపాదనను తక్షణం విరమించుకోవాలని ప్రముఖ పర్యావరణవేత్త బీవీ సుబ్బారావు డిమాండ్ చేశారు. వాతావరణ మార్పులపై ఐక్యరాజ్యసమితి సహా అనేక ప్రపంచ వేదికల్లో గళం వినిపించిన బీవీ సుబ్బారావు, వికారాబాద్ ప్రాంతంపై సుదీర్ఘ పరిశోధనలు చేశారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తాజాగా తీసుకున్న నిర్ణయంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రాడార్ కేంద్ర ఏర్పాటు హైదరాబాద్ వాతావరణ, భౌగోళిక పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని హెచ్చరిస్తున్నారు. ఆయన ఇంకేమన్నారంటే..

బాధ్యతారాహిత్య నిర్ణయం

దామగుండం అటవీ ప్రాంతంలో రాడార్ కేంద్రం కోసం ఏ మొక్కలను, చెట్లను కొట్టేస్తున్నారో ఎందుకు చెప్పడం లేదు? ఏ అభివృద్ధి ప్రణాళికలోనైనా లాభనష్టాలను బేరీజు వేసుకోవాలి. పర్యావరణ అంశం కూడా అంతే. వికారాబాద్ అడవుల్లో 12 లక్షల వృక్షాలను తొలగిస్తున్నట్టు చెప్పారు. తెలంగాణలోనే అత్యంత విలువైన, అరుదైన ఔషధ మొక్కలు వికారాబాద్ అడవుల్లో ఉన్నాయి. ఇది నేను చెప్పడం కాదు.. ఉస్మానియా విశ్వవిద్యాలయం రిసెర్చ్ స్కాలర్లు 500కుపైగా ఔషధ మొక్కలను పేర్లతోపాటు గుర్తించారు. 1946లోనే ఇక్కడ నిజాం నవాబు టీబీ శానిటోరియం ఏర్పాటు చేశారు. టీబీ వంటి వ్యాధులను నయం చేయడానికి వికారాబాద్ పరిసర ప్రాంతాలు ఉపయోగపడ్తాయని, ఇక్కడ స్వచ్ఛమైన గాలి లభిస్తుందని గుర్తించి ఇక్కడ టీబీ శానిటోరియం నెలకొల్పారు. సౌత్-వెస్ట్‌లో వికారాబాద్ ఉంటుంది. మన హైదరాబాద్‌కు వచ్చే గాలి సౌత్-వెస్ట్ నుంచే వస్తుంది. గాలి, నీటిని స్వచ్ఛంగా మార్చడంలో వికారాబాద్ అడవులు ఎంతో కీలకం. గండిపేట నీళ్ల గురించి తెలియనిది ఎవరికి? గండిపేట నీళ్లు ఒంటికి మంచిదని అందరూ చెప్తుంటారు. గండిపేటకు నీళ్లు కూడా వికారాబాద్‌లో పుట్టే మూసీ నది వల్లనే వస్తాయి. వీటన్నింటికి కారణం వికారాబాద్‌లో ఉన్న ఔషధ మొక్కలే. ఇలాంటి అద్భుతమైన ప్రాంతాన్ని రక్షిత ప్రాంతంగా ప్రకటించాలి. ఇప్పటివరకు ప్రభుత్వాలు ఆ పని ఎందుకు చేయలేదు? ప్రతి పంచాయతీలో ఔషధ మొక్కల రిజిస్టర్‌ను ఏర్పాటు చేస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెప్తున్నాయి. కానీ, ఆచరణలో పెట్టడంలేదు.

ప్రజలను మోసం చేస్తున్నారు

వికారాబాద్, దామగుండం రెండూ వేర్వేరు కావు. రెండూ ఒకే అడవిలోని రెండు ప్రాంతాలు. ఇక్కడి అడవిలో అత్యంత అరుదైన ఔషధ మొక్కలు, అరుదైన వృక్షజాతులే కాదు.. వన్యప్రాణులు కూడా ఉన్నాయి. ఇలాంటి అడవిని వికారాబాద్ వేరు, దామగుండం వేరు అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెప్పడం ప్రజలను మోసం చేయడమే. నేవీ అధికారులు ఒక పత్రికా ప్రకటన ఇచ్చారు. వికారాబాద్-దామగుండం ప్రాంతంలో అసలు చెట్లే లేవని, ఇక్కడంతా మైదాన ప్రాంతాలే ఉన్నాయని, అందుకే రాడార్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. దీనిని రాష్ట్ర ప్రభుత్వం, అటవీ అధికారులు ఎందుకు ఖండించలేదు?

హెల్త్ టూరిజంగా చేయవచ్చు

ఇప్పుడు రాష్ట్రంలో హెల్త్ టూరిజాన్ని ప్రమోట్ చేస్తున్నామని ప్రభుత్వాలు చెప్తున్నాయి. హెల్త్ టూరిజం అంటే ఏమిటి? ఫైవ్ స్టార్ దవాఖానలు కట్టి ప్రజలను మాయ చేయడమే కదా? మరి ప్రకృతిసిద్ధమైన వికారాబాద్‌ను హెల్త్‌టూరిజంగా చేయవచ్చు కదా? ఎందుకు చేయలేదు? ప్రకృతిసిద్ధంగా ఉన్న ఔషధ మొక్కల మధ్య ఒక పది రోజులు మనిషి ఉంటే రోగాలన్నీ మాయమవుతాయి కదా?

ఎందుకు విలువ కట్టడంలేదు?

ఏదైనా సంస్థ లేదా వస్తువును అమ్మేటప్పుడు దానికి విలువ కడుతుంటాం. ఇంత పెద్ద అడవికి ఏం విలువ కట్టారు వీళ్లు? ఎలా విలువ మదింపు జరిగింది? ఇక్కడ ఉన్న చెట్లు ఇచ్చే స్వచ్ఛమైన గాలికి, అమూల్యమైన ఔషధ మొక్కలకు విలువ లేదా? జియో బయోక్లైమెటిక్ వాల్యుయేషన్ చేయాలి. ఇలా మదింపు చేసిన విలువకు సంబంధించిన శ్వేతపత్రాన్ని ప్రభుత్వం ప్రజల ముందు పెట్టాలి. శ్వేతపత్రాన్ని శాసనసభలో కూడా పెట్టి చర్చించాలి. దామగుండంలో వీఎల్ఎఫ్ రాడార్ కేంద్రం ఏర్పాటువల్ల తలెత్తే పరిణామాలు ఇలా ఉంటాయని వివరిస్తూ ఒక సమగ్ర నివేదిక ప్రజల ముందు ఎందుకు పెట్టలేదు?

'జల' స్వరూపం మారిపోతుంది

చెట్లు కొట్టేయడం, రాడార్ స్టేషన్ కట్టడం వల్ల ఇక్కడ హైడ్రోలాజికల్ కండిషన్స్ మొత్తం మారిపోతాయి. చెట్లు పోయి, కాంక్రీట్ జంగిల్ వస్తుంది. ఊటలు ఎండిపోతాయి. గ్రౌండ్ వాటర్ పడిపోతుంది. నది మనుగడకే ముప్పు కలుగుతుంది. మూసీ నదిని బాగు చేస్తామని లండన్ పోతున్నరు కానీ.. దామగుండంపోయి నది ఎట్లా పుట్టిందో ఎవరైనా చూస్తున్నారా? మంజీరా నది పుట్టేది కూడా ఇక్కడే. ఇలా ఐదు ఉప నదులు పుడుతున్న పవిత్రమైన స్థలం ఇది. దీనిని ఆధ్యాత్మికంగానూ మనం కాపాడుకోవాలి. మూసీ నది నాకు పవిత్రం. ఈసా, మూసా కలిసిన పవిత్ర సంగమం. దానిని మనమే కాపాడుకోలేనప్పుడు ఎవరో ఇంగ్లిష్ వాళ్లు వచ్చి చేస్తారంటే ఎలా నమ్మేది. పైన నాశనం చేసుకుంటూ పోతూ కింద ఆనకట్టలు కడతామంటే ఎలా?

సర్ మిర్జా అలీ రిపోర్ట్ చూడండి

సర్ మిర్జా అలీ.. ఫస్ట్ ల్యాండ్ ఆర్కిటెక్ట్ ఆఫ్ మూసీ రివర్. ఆయన రిపోర్ట్ చూస్తే నది పవిత్రత తెలుస్తుంది. మూసీ వెంబడి 14 ఉద్యానవనాలను ఆనాడే అభివృద్ధి చేశారు. ఓల్డ్ సిటీ నుంచి చిక్కడపల్లి వరకు 1965 వరకు పార్కులు ఉండేవి. దామగుండంలో ఉన్న జీవవైవిధ్యం, రాతి శిలల వైవిధ్యం మాదిరిగానే ఇక్రిశాట్‌లో ఇంతే వైవిధ్యమైన భూములున్నాయి. అందుకే ఏరికోరి ఇక్రిశాట్‌ను అక్కడే స్థాపించారు.

రాడార్ ఇక్కడే ఎందుకు?

నేవల్ సిగ్నల్ స్టేషన్ ఇక్కడ కాకుండా మరెక్కడా పెట్టొద్దని ఉన్నదా? ఈ స్టేషన్ కోసం కర్ణాటకలోని కోలార్ బంగారు గనుల ప్రాంతం ఇస్తామన్నారు. కోలార్ గనులను తవ్వడం ఆపేశారు. అక్కడ పెడితే ఆ ప్రాంతం బాగుపడుతుంది. కొత్త టౌన్‌షిప్ వస్తుంది. అనేక యూరోపియన్ దేశాల్లో ఇలాంటి వదిలివేసిన గనుల్లో అనేక టౌన్‌షిప్‌లు వచ్చాయి. మనం ఇక్కడ ఎందుకు చేయలేకపోతున్నాం? ప్రజలు, పర్యావరణ మనుగడకు ఇబ్బందికలిగేలా వ్యవహరించడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగదు అని హితవు పలికారు.

ఐదు నదుల జన్మస్థానం

వికారాబాద్ ప్రాంతం అద్భుతమైనది. ఇక్కడ ఒకరకమైన రాతినేలలు కూడా ఉన్నాయి. అడవులు, రాతినేలలు కలిసిన ప్రాంతం. అందుకే ఇక్కడ వందల సంఖ్యలో నీటి ఊటలున్నాయి. వికారాబాద్‌లో ఉన్న అటవీ ప్రాంతం నుంచే మూసీ, ఈసా, కాగ్నా, భీమా వంటి కృష్ణా నది ఉపనదులు పుడుతాయి. విచిత్రం ఏమిటంటే ఇక్కడి నీటి ధారల నుంచే మంజీరాకు సైతం ఒక నీటిధార వెళ్తున్నది. ఇక్కడ చెట్లను తీసివేస్తే వచ్చే వరదను మనం భరించగలమా? వరదలు వస్తే హైదరాబాద్ సహా చుట్టు పక్కల ప్రాంతాల పరిస్థితి ఏమిటో ఆలోచించారా? దామగుండం నుంచి కాగ్నా నది వరద తాండూరు వైపు పోతుంది. దారిలో వచ్చే కల్వర్టులన్నీ కొట్టుకు పోయేంత ఉధృతంగా ప్రవహిస్తుంది. ఇక్కడ వరదను అడ్డుకునే ల్యాండ్ కవర్‌గా ఉన్న చెట్లను తొలగిస్తే వరద ఉధృతి ఇంకా పెరుగుతుంది. దీనిపై ఏమైనా హైడ్రాలాజికల్ స్టడీస్ ఉన్నాయా? లక్షల చెట్లు కొట్టేసిన తర్వాత వరద ఎంత పెరుగుతుంది? అని అధ్యయనం లేకపోవడం వల్లే మెట్రో నగరాల్లో వరద ముప్పు పెరిగింది. దామగుండానికి సంబంధించి పర్యావరణ ప్రభావం అంచనా వేయలేదు. రిస్క్ అసెస్మెంట్ చేయలేదు, ఫైనాన్షియల్ అసెస్మెంట్ చేయలేదు. చెట్ల నరికివేత వల్ల కలిగే నష్టాన్ని అంచనా వేయలేదు.

అమెరికాలో మూసేసిన టెక్నాలజీ మనకెందుకు?

వీఎల్ఎఫ్ రాడార్ కేంద్రం పనితీరుపై అనేక అనుమానాలున్నాయి. ఆరోగ్య సమస్యలు వస్తాయని గత అనుభవాలు చెప్తున్నాయి. అమెరికా వంటి దేశాల్లో వీఎల్ఎఫ్ రాడార్ కేంద్రాలను ప్రభుత్వాలు మూసేశాయి. అత్యాధునిక టెక్నాలజీని వాడుతున్నాయి. మరి మనమెందుకు ఈ పాత టెక్నాలజీని వినియోగిస్తున్నాం? ప్రజల్లో దీనిపై అనేక అనుమానాలున్నాయి. ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉన్నది. ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్‌ను చేయలేదు. రిస్క్ అసెస్‌మెంట్ కూడా చేయలేదు. బయోడైవర్సిటీ అసెస్‌మెంట్ కూడా జరగాల్సి ఉంటుంది. అంటే ఒక మొక్క వల్ల కలిగే ఉపయోగాలు, దాని రాయల్టీ వల్ల వచ్చే ఆదాయం కూడా చూపించాల్సి ఉంటుంది. రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డు ఏం చేస్తున్నది? ఇవన్నీ చేయాలి కదా? అసలు వీళ్ల వద్ద ఒక్క రికార్డు కూడా లేదు. వికారాబాద్ అడవుల్లో లభించే ఔషధ మొక్కలు ఏమిటి? వాటిని గుర్తించదగ్గ సామర్థ్యం ఉన్న స్థానిక ప్రజలు ఎందరున్నారన్న సమాచారం కూడా వీళ్ల వద్ద లేదు. ఇక్కడున్న అపారమైన సంపద తెలంగాణ ప్రజల ఆస్తి.

5న దామగుండం రిసార్ట్స్ యజమానులతో మీటింగ్

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): వికారాబాద్ జిల్లా దామగుండం అటవీ ప్రాంతంలో ఉన్న ప్రైవేటు రిసార్ట్స్ యజమానులతో వికారాబాద్ జిల్లా అటవీ అధికారి ఈనెల 5న సమావేశం కానున్నారు. వికారాబాద్‌లోని జిల్లా అటవీ అధికారి కార్యాలయంలో 15 రిసార్ట్స్ యజమానులతో చర్చించనున్నారు. ఇప్పటికే ఆయా రిసార్ట్స్ యజమానులకు ఫారెస్ట్ రేంజ్ అధికారి నుంచి సమాచారం పంపించారు. దామగుండం అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేయబోయే నేవీ వీఎల్ఎఫ్ రాడార్ కేంద్రం గురించి ఈ సమావేశంలో చర్చించనున్నారు. రాడార్ కేంద్రం ప్రయోజనాలు వారికి వివరించి, ఏర్పాటుకు సహకరించాలని వారిని అటవీ అధికారులు కోరనున్నారు.

బతుకమ్మ చీరలపై సందిగ్ధం

- **ఇంకా చేనేత సంఘాలకు ఆర్డర్ ఇవ్వని ప్రభుత్వం**
- **మంత్రి ఆదేశాలిచ్చినా ముందుకు సాగని ఫైల్**
- **యూనిఫామ్స్ ఆర్డర్ లేక పేరుకుపోయిన వస్త్రాలు**



హైదరాబాద్, జనవరి 31(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో చేనేత, వస్త్ర తయారీ రంగంలో సందిగ్ధం ఏర్పడింది. జనవరి గడిచినా బతుకమ్మ చీరలు, యూనిఫామ్స్‌కు ప్రభుత్వం ఇంతవరకు ఆర్డర్లు ఇవ్వకపోవటమే ఇందుకు కారణం. చీరల తయారీకి వెంటనే ఆర్డర్ ఇవ్వాలని సంబంధిత అధికారులకు చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మౌఖిక ఆదేశాలిచ్చినా అధికారికంగా ఆర్డర్ జారీ కాకపోవటం గమనార్హం. ఈ నేపథ్యంలో తెలంగాణ ఏర్పాటుకు ముందు నేతన్నలు, వస్త్ర పరిశ్రమ ఎదుర్కొన్న గడ్డు పరిస్థితులు మళ్లీ పునరావృతం అవుతాయా? అన్న ఆందోళన మొదలైంది.

గతంలో ఏటా 550 కోట్ల ఆర్డర్లు

చేనేత కార్మికుల ఆకలి చావులను అరికట్టే ఉద్దేశంతో కేసీఆర్ సర్కారు బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్రంలో 18 ఏండ్లు నిండిన ఆడపడుచులకు చేనేత చీరల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 2017 నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా ఏటా సుమారు కోటి చీరలు మహిళలకు పంపిణీ చేస్తున్నారు. ఫలితంగా ఈ వృత్తిలో కొనసాగుతున్నవారికి జీవనభృతి లభించేది. ఈ చీరల కోసం ప్రభుత్వం ఏటా రూ.350 కోట్ల వరకు చేనేత సంఘాలకు చెల్లించేది. అంతేకాదు, గురుకులాలు, ఇతర ప్రభుత్వ వసతి గృహాలు, స్కూళ్లలో చదువుకునే పిల్లలు, పోలీస్‌శాఖ, వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగుల యూనిఫామ్స్ కూడా రాష్ట్రంలోని పాలిస్టర్ తయారీదారులనుంచి కొనుగోలు చేసేవారు. దీనికోసం మరో రూ.200 కోట్లకుపైగా ఖర్చుచేసేది. చీరలు, యూనిఫామ్స్ తయారీ కోసం చేనేత, పవర్‌లూమ్, పాలిస్టర్ వర్కర్లకు ప్రభుత్వం నుంచి ఏటా మొత్తంగా రూ.550 కోట్ల వరకు ఆర్డర్లు వచ్చేవి. ఏటా డిసెంబర్, జనవరిలోనే ఆర్డర్లు ఇవ్వాల్సిన ప్రభుత్వం.. ఇంకా ఇవ్వలేదు.

నిలిచిన యూనిఫామ్స్ తయారీ

ఇప్పటికే తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న చేనేత, పవర్‌లూమ్ కార్మికులు ప్రభుత్వం నుంచి అందాల్సిన వస్త్రాల ఆర్డర్లు అందక వస్త్రాల తయారీని జనవరి 15న నిలిపివేశారు. ప్రస్తుతం తమవద్ద దాదాపు రూ.70 కోట్ల విలువయ్యే పాలిస్టర్ వస్త్రాల నిల్వలు ఉన్నాయని, చేసేదిలేక హైదరాబాద్ పత్తర్‌గట్టి మార్కెట్‌లో తక్కువ ధరకు విక్రయిస్తున్నామని పాలిస్టర్ క్లాత్స్ అసోసియేషన్ ప్రతినిధులు వాపోయారు. చీరలు, యూనిఫామ్స్ తయారీ కోసం ఎటువంటి నిర్ణయం వెలువడకపోవటంతో చేనేత, వస్త్ర తయారీదారులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, పాలిస్టర్ క్లాత్స్ అసోసియేషన్, పవర్‌లూమ్ వర్కర్స్ ఇప్పటికే వస్త్రాల తయారీని నిలిపివేశారని వెల్లడించారు. ప్రభుత్వం స్పందించి ఆర్డర్ ఇస్తే నేత పనులు, వస్త్రాల తయారీకి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. చీరల ఆర్డర్‌పై అధికారుల వివరణ కోరగా.. ఎలాంటి చర్యలూ చేపట్టలేదని స్పష్టం చేశారు.

పంచాయతీ ఎన్నికలు జరపలేదేం?

- **రాష్ట్ర ప్రభుత్వం, ఈసీకి హైకోర్టు నోటీసులు**
- **ప్రభుత్వానికి లోబడి ఎన్నికల సంఘం శైలి**
- **కనీసం ఓటర్ల జాబితానైనా సిద్ధం చేయలేదు**
- **ధర్మాసనం ముందు పిటిషనర్ల వాదనలు**

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): నిర్దిష్ట ఐదేండ్ల పదవీకాలం ముగిసేలోగా గ్రామ పంచాయతీలకు ఎన్నికలు ఎందుకు నిర్వహించలేదో తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఎన్నికలు నిర్వహించకపోవటంపై సమగ్ర వివరాలతో కౌంటర్ పిటిషన్లు దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం, ఈసీని ఆదేశించింది. సర్పంచుల పదవీకాలం ముగిసిపోతున్నా ఆ పదవులకు ఎన్నికలు నిర్వహించకపోవటాన్ని తప్పుపడుతూ జనగామ జిల్లా కాంచనపల్లి, చెంగెర్ల, నిర్మల జిల్లా తల్వాడ, కరీంనగర్ జిల్లా నిజాయతీగూడెం సర్పంచులు విజయవేణుగోపాల్, అనిల్‌కుమార్, మురళీధర్ ఇతరులు దాఖలు చేసిన వ్యాజ్యాలపై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే శరత్ బుధవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ, పంచాయతీలకు 2019 జనవరిలో ఎన్నికలు జరిగాయని, వీరి పదవీకాలం బుధవారంతో ముగిసిందని తెలిపారు. పదవీకాలం ముగిసే నాటికి ఎన్నికలు నిర్వహించాలని రాజ్యాంగం నిర్దేశించినా, పంచాయతీరాజ్ చట్టానికి విరుద్ధంగా ప్రభుత్వ చర్యలు ఉన్నాయని తెలిపారు. ఎన్నికల సంఘం కూడా సజావుగా పనిచేయటం లేదని, ప్రభుత్వానికి లోబడి వ్యవహరిస్తున్నదని వెల్లడించారు. సర్పంచుల పదవీకాలం ముగియటానికి ఆర్నెల్ల ముందే ఎన్నికల నిర్వహణకు ఈసీ చర్యలు చేపట్టాలని, కనీసం ఓటర్ల జాబితానైనా సిద్ధం చేసి ఉండాల్సిందని వివరించారు. గురువారం నుంచి పంచాయతీలు ప్రత్యేకాధికారుల పాలనలోకి వెళ్తున్నాయని, దీన్ని అడ్డుకోవాలని కోరారు. ఎన్నికలు నిర్వహించే వరకు ప్రస్తుత సర్పంచులనే కొనసాగించేలా ఉత్తర్వులు జారీ చేయాలని విన్నవించారు. వాదనల అనంతరం సర్పంచుల పదవీ కాలాన్ని పొడిగించేందుకు హైకోర్టు నిరాకరించింది. ఎన్నికల నిర్వహణకు తీసుకునే చర్యలను వివరించాలని ప్రతివాదులైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పంచాయతీరాజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్, రాష్ట్ర ఎన్నికల సంఘం, ఆయా జిల్లా కలెక్టర్లకు నోటీసులు జారీ చేస్తూ విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

రేపటి నుంచి పంచాయతీల్లో 'ప్రత్యేక' పాలన

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం నుంచి ప్రత్యేక అధికారుల పాలన అమలులోకి రానున్నది. గురువారంతో సర్పంచుల పదవీకాలం ముగియనుండటంతో ప్రభుత్వం రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించింది. శుక్రవారమే బాధ్యతలు స్వీకరించాలని ఆ ఆదేశాల్లో పేర్కొన్నది. ఆయా మండలాల్లోని ఎంపీడీవో, తహసీల్దార్, ఎంపీవో, డీటీ, ఆర్ఐ, ఇంజినీర్లు, ఇతర గెజిటెడ్ అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా ఉన్నతాధికారులు నియమించారు. గురువారం సాయంత్రమే సర్పంచుల ఆధీనంలో ఉన్న డిజిటల్ కీలు, చెక్కులు, ఇతర రికార్డులన్నంటినీ స్వాధీనం చేసుకోవాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. రికార్డుల స్వాధీనంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీప్పవని హెచ్చరించారు. ప్రత్యేక అధికారికి, కార్యదర్శికి ప్రభుత్వం జాయింట్ చెక్ పవర్ అవకాశం కల్పించింది. డిజిటల్ కీకి స్పెషల్ ఆఫీసర్ అధీకృత అధికారిగా వ్యవహరిస్తారు. డిజిటల్ కీ, చెక్కులు, రికార్డుల్లో ఏదైనా సమస్య తలెత్తితే కార్యదర్శిదే బాధ్యత అని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. ఇక నుంచి గ్రామ పంచాయతీలలో డ్రా చేసే నిధులన్నింటినీ స్పెషల్ ఆఫీసర్, పంచాయతీ కార్యదర్శులు బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఉమ్మడి రాష్ట్రంలో కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో 2011 నుంచి 2013 వరకు, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక 2018లో పంచాయతీలు స్పెషల్ ఆఫీసర్ల పాలనలో ఉన్నాయి.

నీరుగారిన గ్రూప్-1 ఆశలు!

- **ఫిబ్రవరి 1న నోటిఫికేషన్ ఇస్తామన్న హామీని విస్మరించిన సర్కారు**
- **హడావుడిగా ఖాళీల వివరాల సేకరణ**
- **100 పోస్టులు ఉన్నట్టు సమాచారం**

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): ఫిబ్రవరి 1న గ్రూప్-1 నోటిఫికేషన్ ఇస్తామంటూ ఎన్నికల ప్రచారంలో ఊరించిన కాంగ్రెస్ నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లింది. కేవలం ఒక్కరోజు ముందు హడావుడిగా కసరత్తు మొదలుపెట్టిన ప్రభుత్వం బుధవారం సాయంత్రానికి కల్లా ఖాళీల వివరాలు అందజేయాలని ప్రభుత్వశాఖలను ఆదేశించింది. దీంతో 100 పోస్టులు ఉన్నట్టు అధికారులు లెక్క తేల్చినట్టు సమాచారం. గ్రూప్-1 నోటిఫికేషన్‌ను 2022లో కేసీఆర్ ప్రభుత్వం జారీ చేసింది. అప్పట్లో 503 పోస్టులతో నోటిఫికేషన్ వెలువడగా 2.33 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. దీంతో తాజాగా గుర్తించిన 100 పోస్టులకు ఆర్థికశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వాల్సి ఉంటుంది. ఆ తర్వాత శాఖల వారీగా ఇండెంట్లు, పోస్టుల భర్తీకి అర్హతలు, నిబంధనలు వంటి అంశాలు టీఎస్‌పీఎస్సీకి చేరుతాయి. ఆ తర్వాతే టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ జారీచేస్తుంది. కొత్తగా చేర్చే పోస్టులకు అదనపు నోటిఫికేషన్ జారీచేయనున్నట్టు టీఎస్‌పీఎస్సీ వర్గాలు వెల్లడించాయి. ఇందుకు కనీసం వారం, పది రోజులు పడుతుందని అధికారవర్గాలు చెప్తున్నాయి.

మున్సిపాలిటీల్లో అవిశ్వాసాలపై అప్పీళ్లు డిస్మిస్

హైదరాబాద్, జనవరి31 (నమస్తే తెలంగాణ): జనగామ, ఆలేరు, దమ్మాయిగూడ, సదాశివపేట, అందోల్-జోగిపేట, జవహర్‌నగర్ తదితర మున్సిపల్ చైర్మన్లపై అవిశ్వాస తీర్మానాల వ్యవహారాల్లో జోక్యం చేసుకొనేందుకు హైకోర్టు నిరాకరించింది. అవిశ్వాస తీర్మానాలపై సింగిల్ జడ్జి తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన అప్పీళ్లను సీజే జస్టిస్ అలోక్ అరధే, జస్టిస్ అనిల్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం బుధవారం కొట్టివేసింది. అవిశ్వాస తీర్మానాలపై జోక్యం చేసుకునేందుకు సింగిల్ జడ్జి నిరాకరించడాన్ని కొందరు మున్సిపల్ చైర్మన్లు అప్పీళ్లు దాఖలు చేశారు. వారి తరఫు సీనియర్ న్యాయవాది కే వివేక్‌రెడ్డి, మయూర్ రెడ్డి వాదిస్తూ, రాష్ట్ర మున్సిపల్ చట్టం-2019 సెక్షన్ 37లో అవిశ్వాస తీర్మానం ఆమోదించడానికి విధివిధానాలు లేవని తెలిపారు. వాదనల తర్వాత సింగిల్ జడ్జి ఉత్తర్వులపై జోక్యం చేసుకునేందుకు నిరాకరిస్తూ అప్పీళ్లను హైకోర్టు కొట్టివేసింది.

డీసీఏతో అమెరికా ఎఫ్‌డీఏ జట్టు

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కంట్రోల్ అథారిటీతో (డీసీఏ) అమెరికాకు చెందిన ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) చేతులు కలిపింది. భారత్‌లో ఎఫ్‌డీఏ ప్రతినిధి డాక్టర్ సారా మెక్‌కల్లం నేతృత్వంలోని బృందం బుధవారం హైదరాబాద్ వెంగళ్‌రావునగర్‌లోని డీసీఏను సందర్శించినట్టు సంస్థ డీజీ కమలాసన్‌రెడ్డి తెలిపారు. దేశంలోని ఫార్మా ఉత్పత్తుల్లో 35 శాతం తెలంగాణ నుంచే వస్తుండటం, యూఎస్ ఎఫ్‌డీఏ అనుమతులు పొందిన 214 ఫార్మా కంపెనీలు తెలంగాణలో ఉన్న నేపథ్యంలో సంయుక్తంగా 'రెగ్యులేటరీ ఫోరం' ఏర్పాటు చేయాలని వారు ప్రతిపాదించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా డీసీఏ కార్యకలాపాలను వారికి వివరించామని తెలిపారు. అనంతరం సారా మెక్‌కల్లం ఎఫ్‌డీఏ అనుమతులు పొందిన కంపెనీలు ఎలాంటి నిబంధనలు పాటించాలో వివరించారని పేర్కొన్నారు. కంపెనీల పర్యవేక్షణకు, భవిష్యత్తులో బంధాలను మరింత బలోపేతం చేసుకునేందుకు సంయుక్తంగా ఒక కమిటీని వేయాలని ప్రతిపాదించారని తెలిపారు.

ఆర్టీసీలో ఉచితంపై పిల్ కాదు పిటిషన్ వేయాలి

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీలో మహిళల ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాన్ని ప్రజాహిత పిటిషన్‌గా పరిగణించలేమని హైకోర్టు స్పష్టం చేసింది. రిట్ పిటిషన్‌గా మార్పు చేయాలని ఆదేశించింది. మహిళలకు ఉచిత ప్రయాణం కోసం ప్రభుత్వం జారీచేసిన జీవో 47ను సవాలు చేస్తూ హైదరాబాద్‌లోని నాగోల్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగి ఏ హరీందర్ పిల్ దాఖలు చేశారు. ఉద్యోగానికి వెళ్లడానికి ఇబ్బందిగా ఉంటున్నదని వాదించారు. వ్యక్తిగత ఇబ్బందులపై పిల్ దాఖలుకు వీల్లేదని, పిటిషన్‌గా మార్చాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరధే, జస్టిస్ జే అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం పిటిషనర్‌ను ఆదేశించింది.

వాహన చలాన్ల గడువు మళ్లీ పెంపు

- **ఫిబ్రవరి 15 వరకు అవకాశం**

హైదరాబాద్, జనవరి 31(నమస్తే తెలంగాణ): వాహనాల పెండింగ్ చలాన్లు చెల్లింపు గడువును ప్రభుత్వం మరోసారి పొడిగించింది. బుధవారం ముగిసిన గడువును ఫిబ్రవరి 15 వరకు పెంచుతూ ఉత్తర్వులిచ్చింది. గత డిసెంబర్ 26 నుంచి పెండింగ్ చలాన్లపై రాయితీలను ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ చలాన్లు రూ. 3.59 కోట్లు ఉండగా.. దాదాపు రూ. 1.50 కోట్ల చలాన్లకు పైగా చెల్లింపులు జరిగాయి. పెండింగ్ ట్రాఫిక్ చలాన్ల రాయితీతో ప్రభుత్వానికి రూ. 135 కోట్లకు పైగానే ఆదాయం సమకూరింది. టూ వీలర్స్ , ఆటోల చలాన్లపై 80 శాతం, ఆర్టీసీ బస్సులకు 90 శాతం, ఇతర వాహనాలకు 60 శాతం రాయితీ ప్రకటించిన విషయం తెలిసిందే.

ఇన్నోవేషన్‌లో తెలంగాణ టాప్

మొదటిపేజీ తరువాయి...

పంజాబ్, హర్యానా తదితర రాష్ట్రాలు ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఇన్నోవేషన్‌లో నాయకత్వ స్థానానికి ఎదుగుతున్నాయి. 2004-2013 మధ్య ఇన్నోవేషన్స్‌లో తెలంగాణ వాటా 0.1 శాతంగా ఉండగా, 2014-2023 మధ్య 4 శాతం వాటాను సాధించింది. రాష్ట్రంలోని గ్రామాల్లోనూ ఆవిష్కరణలు విస్తరిస్తున్నాయి. 1.2 శాతం నుంచి 2.3 శాతం వృద్ధితో రాజస్థాన్ ద్వితీయస్థానంలో నిలిచింది. భారత్‌లో 2004-13 మధ్యకాలంలో సింగిల్ ఇన్వెంటర్స్ వాటా 22.9 శాతం ఉండగా, 2014-23 మధ్య ఇది 35.5 శాతానికి చేరిందని ఎమర్జింగ్ టెక్నాలజీస్ నిపుణులు, సెవెన్ సీస్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎండీ ఎల్ మారుతి శంకర్ తెలిపారు. ఉత్తరాఖండ్, ఒడిశా, అండమాన్ నికోబార్ దీవులు, ఛత్తీస్‌గఢ్, జమ్ముకశ్మీర్, పుదుచ్చేరి, హిమాచల్‌ప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో కూడా ఆవిష్కరణలు వృద్ధి చెందుతున్నట్టు నివేదిక తెలిపింది. రాష్ట్రంలో ఐటీ, పరిశ్రమల మంత్రిగా కేటీఆర్ ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు పెద్దఎత్తున చర్యలు చేపట్టారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆవిష్కరణల కోసం టీ-హబ్‌ను ఏర్పాటుచేసి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందించారు. ఐటీ, ఎమర్జింగ్ టెక్నాలజీస్ రంగంలో రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలిపేందుకు కృషిచేశారు. ఆ కృషి సత్ఫలితాలను ఇస్తున్నదని తాజాగా ఏకోరాప్ నివేదిక స్పష్టం చేసింది.